



రేషన్ దందా.. రూ. 32 కోట్లు

రెచ్చిపోతున్న బియ్యం మాఫియా

ఉచిత బియ్యం.. రూ.32 కోట్లు తెచ్చిపెడుతోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నెల నెల అక్రమార్కులు, నేతలు, అధికారులు కలిసి రూ.32 కోట్లు తినేస్తున్నారు. పేదల కడుపు నింపాల్సిన బియ్యం అక్రమార్కుల బొక్కసాలను నింపుతోంది. గతంలో రేషన్ అక్రమాలపై గళమెత్తి.. ఇప్పుడు అధికారం చేపట్టిన నేతలు కూడా అదే తీరుగా దందా సాగిస్తున్నారు. అధికారం మారింది.. బియ్యం వ్యాపారులు మారారు. అంతే అక్రమాలు మాత్రం అప్పటిలాగానే కొనసాగుతున్నాయి. ఎండీయూ ఆపరేటర్లు కొందరు కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా నగదు ఇస్తున్నారు. కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యంలో సగానికిపైగా ఇలా తరలిపోతోంది. అధికార పార్టీ నేతలు కొందరు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. రేషన్ దందాలో అధికార పార్టీ నేతలు భాగస్వామ్యం ఉండటంతో అధికారులు మామూళ్లు పుచ్చుకుని అక్రమాలను పట్టించుకోవడంలేదు. కొన్ని ప్రాంతాల్లో ధైర్యం చేసి తనిఖీలకు వెళ్లినా రేషన్ మాఫియా ఏకంగా అధికారులపైనే దాడులకు దిగుతున్నారు. కాకినాడ పోర్టులో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనిఖీలు, రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దందా చర్చ నేపథ్యంలో జిల్లాల్లోని పరిస్థితులు ఇలా ఉన్నాయి.

- పాలకులు మారినా ఆగని అక్రమాలు
- రాజకీయ ఒత్తిళ్లతో చేతులెత్తేస్తున్న అధికారులు
- వ్యవస్థలకు సవాల్ విసురుతున్న రేషన్ మాఫియా
- మంత్రి నాదెండ్ల ఇటీవల అక్రమాలు గుర్తించినా అధికారులు మౌనం
- కాకినాడలో ఉపముఖ్యమంత్రి తనిఖీలతో గుజరాత్‌కు తరలిస్తున్న అక్రమార్కులు



కొమరెపూడి మిల్లులో ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు



చుండూరు మండల పరిధిలోని ఓ రైస్‌మిల్లులో రేషన్‌బియ్యం పట్టుకున్న అధికారులు (ఫైల్ ఫొటో)

(బాపట్ల, నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తోన్న బియ్యం పంపిణీని నగదు బదిలీ పథకంగా అక్రమార్కులు మార్చారు. ఎండీయూ వాహనం వద్దే బియ్యం దందా బాహాటంగా సాగుతోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి నేతృత్వం వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. బియ్యం కోటాకు బదులుగా కిలోకు రూ.8 నుంచి రూ.12 లెక్క గట్టి మరీ కార్డుదారులకు నగదు ఇస్తున్నారు. రేషన్ కార్డును కాపాడుకునేందుకు కొందరు నెలావారీగా బియ్యం తీసుకుని దళారులకు విక్రయిస్తున్నారు. మరికొందరు ఆ బియ్యాన్ని తినలేక ఎండీయూ ఆపరేటర్ల నుంచే నగదు తీసుకుంటున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఒక పట్టు పాలిష్ వేసి, గోతాలు మార్చి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. కార్డుదారులకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నిల్వల్లో సగానికిపైగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నదనేది బహిరంగ రహస్యం. రేషన్ పంపిణీపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నెలవారీ తనిఖీలు నిర్వహించడాన్ని కూడా వారు విస్మరించారు. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో 17,30,810 తెల్లకార్డులు ఉండగా ప్రతీ నెలా 2,55,977 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీటిలో 40 నుంచి 50 శాతం బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు అంచనా. అంటే దాదాపు 1.15 లక్షల క్వింటాళ్ల వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. టోకు వ్యాపారి కిలో రూ.28 బియ్యం కొనుగోలు చేస్తుండగా ఈ ప్రకారం దాదాపు ప్రతి నెలా రూ.32 కోట్లకు బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా. వైసీపీ అధికారంలో ఉండగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసిన వ్యాపారులనే కూటమి నేతలు కొందరు కొనసాగిస్తున్నారు. వైసీపీ పాలనలో పెద్ద ఎత్తున బియ్యం బ్లాక్ మార్కెట్ జరిగింది. అప్పట్లో బియ్యం అక్రమ నిల్వలను ప్రతిపక్ష నేతలు పట్టించారు. బియ్యం అక్రమ వ్యాపారంపై పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. అధికారం మారగానే బియ్యం అక్రమ వ్యాపారం నిరోధిస్తారని (మిగతా 8లో)

పాలిష్ పట్టి ఎగుమతి


కార్డుదారుల నుంచి కిలో రూ.8 నుంచి రూ.12 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీరి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కులు రూ.14 నుంచి రూ.16 వరకు కొనుగోలు చేస్తున్నారు. టోకు వ్యాపారి కిలో బియ్యం రూ.28 కొనుగోలు చేస్తున్నాడు. స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళ్లలో బియ్యం సేకరించి ముందుగా ఏర్పాటు చేసుకున్న స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లులను లీజుకు తీసుకుని సేకరించిన బియ్యానికి ఒక పట్టు పాలిష్ వేసి గోతాలు మారుస్తున్నారు. 25.. 50 కేజీల ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గతంలో కాకినాడ పోర్టుకు బియ్యం నిల్వలు తరలించేవారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలతో బియ్యం బ్లాక్ మార్కెట్ రూటు మారింది. జిల్లాలో సేకరించిన బియ్యం నిల్వలను ప్రస్తుతం గుజరాత్‌కు తరలిస్తున్నట్లు అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు.

925 క్వింటాళ్ళ బియ్యం గుర్తింపు

వినుకొండటౌన్: స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులోని వెంకటరమణ ట్రేడర్స్ రైస్ మిల్లు, విఠంరాజుపల్లి సమీపంలోని పిచికలపాలేనికి వెళ్ళే రహదారి వద్ద తిరుమల రైస్ మిల్‌లో ఇన్‌చార్జి డీఎస్‌వో నారదమణి, తహసీల్దార్ సురేష్‌నాయక్‌లు మంగళవారం తనిఖీలు చేశారు. వెంకటరమణ రైస్ మిల్లులో తెల్లగోతాల్లో నింపిన 700 క్వింటాళ్ళ బియ్యంతోపాటు రెండు రాసుల బియ్యాన్ని, తిరుమల రైస్‌మిల్లులో 470 బస్తాలను గుర్తించారు. పీడీఎస్ బియ్యం గుర్తించేందుకు వీలు లేకుండా పాలిష్ పట్టినట్లు అధికారులు తేల్చి వాటిని పరీక్ష లకు పంపారు. అయితే మిల్లుల్లో తనిఖీల సమాచారాన్ని అధికారులు గుట్టుగా ఉంచడంపై అనుమానాలకు తావిస్తోంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి ఆటోలో రెండు బస్తాల రాగులు, ఆరు బస్తాల జొన్నలను ఆటోలో పట్టణంలోని మసీదు సెంటర్‌లోని ఓ వ్యాపారి పట్టపగలు తరలించాడు. రాగులు, జొన్నలు బ్లాక్‌మార్కెట్‌కు తరలింపుపై తహసీల్దార్‌ను వివరణ కోరగా రేషన్‌షాపులను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



తిమ్మాయపాలెం రోడ్డులోని వెంకటరమణ రైస్ మిల్లుల్లోని బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్‌సప్లయ్ అధికారులు



- పునర్నిర్మాణ పనులకు క్యాబినెట్ ఆమోదం
- రూ.11,467 కోట్లు కేటాయింపుతో పనుల పరుగు
- లేఅవుట్ల అభివృద్ధి, భవనాలు, వసతులకు ప్రాధాన్యం
- గ్రామాలను జోన్లుగా విభజించి అభివృద్ధి పనులకు శ్రీకారం
- తొలి విడత పనుల్లో లేఅవుట్లకు అగ్రతాంబూలంపై రైతుల హర్షం

అమరావతికి నవకళ

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అంధకారంలో చిక్కుకుపోయిన నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి నవకళ రాబోతోంది. రాజధాని పునర్నిర్మాణ పనులకు మంగళవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం ఆమోదముద్ర వేసింది. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు రూ.11,467 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలకు సోమవారం సీఆర్డీఏ ఆమోదించగా, మంగళవారం రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీంతో ఐదేళ్ల క్రితం ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులు ఇక చకచకా పరుగులు పెట్టనున్నాయి. తొలి విడత పనుల్లో అగ్రతాంబూలం లేఅవుట్లకు ఇవ్వడంపై రైతుల ఆనందానికి అవధులే లేకుండాపోయాయి. ఇప్పటికే తుది దశకు చేరిన గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, క్లాస్- 4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి రూ.594.54 కోట్లు కేటాయించింది. ఆ భవనాల వద్ద తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, వరద నీటి కాల్వలు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, భవన సంరక్షణ తదితర మౌలిక సదుపాయాల కోసం మరో రూ.226.26 కోట్లు కేటాయించింది. నాన్ గెజిటెడ్ అధికారుల టవర్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.594.36 కోట్లు కేటాయించారు. ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల నివాసాల కోసం రూ.516.6 కోట్లు కేటాయించారు.

రైతుల లే అవుట్ల అభివృద్ధికి భారీగా..


భూ సమీకరణ విధానంలో భూములిచ్చిన రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. తొలివిడతగా 8,496.3 ఎకరాల్లో ప్లాట్ల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి, మంచినీటి సరఫరా, వరదనీరు, మురుగునీరు పారుదల, విద్యుత్, ఐటీసీ కేబుళ్లు, రోడ్ల వెంట (మిగతా 8లో)

సాగు సంఘాల ఎన్నికలు... మళ్లీ వాయిదా

వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికలకు ముహూర్తం కుదరడంలేదు. 8న జరగాల్సిన మళ్లీ ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ముందస్తు ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశారు. అయితే తదుపరి ఉత్తర్వులు విడుదలయ్యే వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటి పరిధిలో 2,628 టీసీ(టెరిటోరియల్ కానిస్టెన్సీ)లు ఉన్నాయి. ఒక్కో సంఘం పరిధిలో దాదాపు 12 టీసీలు ఉన్నాయి. తొలుత టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. టీసీలకు ఎన్నికైన వారు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాలువ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నికుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. డీసీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటుంది. 8న నీటి సంఘాలకు, 11న డీసీలకు, 14న ప్రాజెక్టు కమిటీకి జరగాల్సిన ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది.



రాజకీయాలకతీతంగా పేరెంట్స్, టీచర్స్ మీట్

- జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 7న నిర్వహించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, పక్కన జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 3: రాజకీయాలకతీతంగా ఈ నెల 7న జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డా.బి.ఆర్. అంబేద్కర్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించే ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ప్రతి పాఠశాలలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కేవలం ఆహ్వానితులుగానే హాజరవుతారని, పాఠశాల ఆవరణలో ఎటువంటి రాజకీయ బ్యానర్లు ప్రదర్శించరాదన్నారు. అలాగే సమావేశంలో ఎటువంటి రాజకీయ ప్రసంగాలకు తావులేదనే విషయం ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ప్రతి విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డు అందించాలని, వారి తల్లిదండ్రులకు తప్పనిసరిగా దాని గురించి వివరించాలన్నారు. సమావేశం సందర్భంగా పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించాలని డీఎంహెచ్‌వో రవిని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య సంబంధ విషయాలపై తల్లిదండ్రుల సందేహాలకు వైద్యులు సమాధానాలు ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన సమయానికి సమావేశం ముగించాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, మండల ప్రత్యేక అధికారులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

శావల్యాపురం, డిసెంబరు 3: స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అప్పగించిన ఇంటిపన్నుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో అలసత్వం వహించిన మతుకుమల్లి, పోట్లూరు పంచాయతీ కార్యదర్శులకు డీపీవో విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పన్నుల వివరాలను నవంబరు 30వ తేదీకి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నవంబరు 13న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే పోట్లూరులో 43శాతం, మతుకుమల్లిలో 49శాతం మాత్రమే ఇంటిపన్నుల ఆన్‌లైన్ నమోదు పూర్తయింది. దీంతో ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించారని పోట్లూరు, మతుకుమల్లి కార్యదర్శులకు డీపీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ అదనపు బాధ్యతలతో తమపై పనిభారం పడిందని చెప్పారు. గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులను నియమించాల్సిన గ్రామాలకు గ్రేడ్-4 కార్యదర్శులమైన తమకు అదనపు బాధ్యతలు అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

- జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలు నిలిపేయాలి
- ఉదయం 8 గంటల వరకే సరుకు రాకకు అనుమతి
- 7 గంటలకు బిడ్డింగ్, ఆ వెంటనే కాటాలు మొదలు కావాలి
- మిర్చి వ్యాపారుల సమావేశంలో మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

ఈ-నామ్‌ని పాటించాల్సిందే

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనామ్ అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉన్నది. ప్రభుత్వ ఆదేశాలకు లోబడే ఎవరైనా యార్డులో కార్యకలాపాలు కొనసాగించుకోవాలి. నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకొంటామని మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత ఆదేశాల మేరకు ఆయన గుంటూరు మిర్చియార్డు పరిపాలన భవనంలో ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు, వేమెన్‌లతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈనామ్ అమలులో ఏమైనా లోపాలు ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి అవకాశం ఉంది, అంతేకానీ ఆ విధానానికి వ్యతిరేకంగా ఏమి చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. మిర్చియార్డు సీజన్ ప్రారంభం కాబోతున్న దృష్ట్యా ఏ రోజు వచ్చిన సరుకు ఆ రోజు బయటకు వెళ్లేలా చూడాల్సి ఉంది. ఇందుకోసం ఉదయం 8 గంటల వరకు మాత్రమే యార్డులోనికి లారీలను అనుమతిస్తామన్నారు. ఉదయం 7 గంటలకే బిడ్డింగ్ మొదలు పెట్టి ఆ వెంటనే కాటాలు వేసేలా చూస్తామని చెప్పారు. గేట్ ఎంట్రీ వద్ద లాట్ ఐడీల ఉత్పత్తికి తక్షణ చర్యలు తీసుకొంటామని, సిస్టమ్‌లు, ట్యాబ్‌ల సంఖ్య పెంచి అదనపు డీఈవోలను నియమిస్తామన్నారు. యార్డులోకి వాహన ప్రవేశం, నిష్క్రమణ రెండూ తప్పనిసరిగా ఆన్‌లైన్ లాట్ ఐడీ, గేట్ పాస్ ఈనామ్‌లో రూపొందించబడిందని నిర్ధారించుకోవాలని, మాన్యువల్ గేట్‌పాస్ పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. లైసెన్సు పొందిన తూకందారులందరికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి. ఐడీ కార్డులు, యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలన్నారు. యార్డులో రికార్డులను సరిగ్గా తనిఖీ చేసి యార్డులో కాటాదారుల భౌతిక ఉనికిని క్రాస్‌చెక్ చేస్తామన్నారు. లావాదేవీలు అన్ని ఈనామ్‌లో అమలయ్యేలా సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పిస్తాం. పొరుగుసేవలతో పాటు రెగ్యులర్ సిబ్బందిని సరైన డ్యూటీ ఆర్డర్‌లతో రొటేషన్ ప్రాతిపదికన తగిన ప్రదేశాలలో నియమిస్తామన్నారు. జీరో, బిల్ టూ బిల్, కటింగ్ బిజినెస్‌లు పూర్తి నియంత్రించాలి. అలానే మచ్చుకాయలు తీయడాన్ని కూడా నిలిపేయాలన్నారు. సమావేశంలో పాల్గొన్న వ్యాపారస్థులు మాట్లాడుతూ బిల్ టూ బిల్ వలన రైతు, మార్కెట్ కమిటీ, ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదన్నారు. ఒక వ్యాపారి వద్ద తగినంత క్రెడిట్ లేకపోతే మరో వ్యాపారి పేరుతో రైతు సరుకుని విక్రయిస్తున్నామన్నారు. రైతు తీసుకొచ్చిన సరకుకు ఒక లాట్ ఐడీని ఉత్పత్తి చేస్తున్నారని, అయితే ఆ రైతు యార్డులో వేర్వేరు దుకాణాల్లో సరుకు అమ్ముతున్నారని, దాని వలన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కటింగ్, జీరో బిజినెస్‌లు పూర్తిగా నిలిపేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ డీడీ ఝాన్సీరాణి, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు, సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, వ్యాపార సంఘాల నాయకులు ఎల్ అప్పిరెడ్డి, పమిడి కృష్ణ, సుధాకర్, నరేంద్ర, తోట రామకృష్ణ, కర్లపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

కోడిపోరు

- వీరారాధన ఉత్సవాల్లో నాలుగో రోజు
- మాచర్ల కోడితో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
- గురజాల కోడితో గుడివాడ ఎమ్మెల్యే రాము

8



ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

ముట్లూరు పునీత శౌరి దేవాలయ తిరునాళ్లలో బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

తిమ్మాపురంలో గంజాయి విక్రేత అరెస్టు

వ్యవసాయ రంగంలో పీజీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు

- యారాతో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒప్పందం

6

ఆంధ్రప్రదేశ్ క్రీడా పాలసీ ఉత్తమం

- శాప్ చైర్మన్ రవినాయుడు
- ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో
ఆంధ్రా కుర్రాడు కార్తీక్ రెడ్డికి నాలుగు పతకాలు



గుంటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సౌత్ ఆఫ్రికాలోని డర్బన్ వేదికగా నవంబరు 28 నుండి డిసెంబరు 1 వరకు జరిగిన కామన్ వెల్త్ కరాటే ఛాంపియన్ షిప్ - 2024 పోటీలలో రాష్ట్రానికి చెందిన అరబండి కార్తీక్ రెడ్డి నాలుగు కాంస్య పతకాలు గెలుచుకొని అంతర్జాతీయ వేదికపై తెలుగు వారి ఖ్యాతిని నిలబెట్టాడు. ఈ మెగా ఈవెంట్‌లో ఎలైట్, క్లబ్ కేటగిరీలలో వేర్వేరు విభాగాల్లో పోటీ పడిన కార్తీక్ రెడ్డి, పసిడి, రజిత (రెండు), కాంస్య పతకాలు కైవసం చేసుకొని అందరి దృష్టిని ఆకర్షించాడు. తన ప్రతిభతో దేశాన్ని గర్వపడేలా చేసిన కార్తీక్ రెడ్డి, భారత్ కరాటే కు గొప్ప పేరు తీసుకువచ్చాడని భారత కరాటే హెడ్ కోచ్ కొండ్రు కీర్తన్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కామన్ వెల్త్ కరాటే ఛాంపియన్ షిప్ 11వ ఎడిషన్ లో భారత్ కు ప్రాతినిధ్యం వహించి నాలుగు పతకాలతో మెరవడం పై నిర్వాహకులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ నుంచి మొత్తం 15 మంది క్రీడాకారులు ఈ ఈవెంట్‌లో పాల్గొనగా, కార్తీక్ రెడ్డికి మాత్రమే నాలుగు పతకాలు లభించటం విశేషం. తన కుమారుడు అంత ర్జాతీయ వేదికలపై రాణించడంపై తండ్రి హైదరాబాద్ మేడ్చల్ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ ఎ చంద్రశేఖరరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఆయన గతంలో గుంటూరు సీజీఎస్టీ కమిషనర్‌గా, విజయవాడ కస్టమ్స్ కమిషనర్‌గా పనిచేశారు.

న్యాయమూర్తుల పదోన్నతుల బదిలీలు

గుంటూరు(లీగల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 15 కోర్టుల్లో పని చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతి కల్పించి వారిని మరో ప్రాంతానికి బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులోని నాలుగవ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎమ్ కుముదినిని ఇక్కడే ఖాళీ గా ఉన్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఖాళీ అయిన ఆమె స్థానంలో ప్రస్తుతం నూజివీడులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కే హరి బాబును పదోన్నతిపై నియమించారు. పొన్నూరులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం అంజనీ ప్రియదర్శినిని పదోన్నతిపై మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు.

2025లో కార్మికులకు ఇచ్చే వేతనంతో కూడిన సెలవులు ఇవే

గుంటూరు(తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది 2025 సంవత్సరానికి గాను కార్మికులకు ఇచ్చే వేతనంతో కూడిన సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు ఉమ్మడి గుంటూరు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 26న రిపబ్లిక్‌డే, మే1 న మే డే, ఆగస్టు15న స్వాతంత్ర్యదినోత్సవం, అక్టోబరు2న గాంధీ జయంతి, నవంబరు1న రాష్ట్ర అవతరణ దినోత్సవం జాతీయ సెలవులుగా, జనవరి 15న కనుమ, మార్చి 31న రం జాన్, ఆగస్టు 27న వినాయకచవితి, డిసెంబరు 25న క్రిస్మస్ పండుగ సెలవులుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీనిని గమనించి పరిశ్రమల యజమానులు కార్మికులకు వేతనంతో కూడిన సెలవులను ఇవ్వాలని ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ క్రీడా పాలసీ ఉత్తమం

- శాప్ చైర్మన్ రవి నాయుడు
- ఏఎన్‌యూలో ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

పెదకాకాని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా పాలసీ ఎంతో ఉత్త మంగా నిలుస్తుందని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో మంగళవారం అంతర యూనివర్శిటీల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రాజధానికి అతి దగ్గరలో ఉన్న ఈ యూనివర్సిటీ క్రీడా యూనివర్సిటీగా రూపాంతరం చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. క్రీడాకారులు ఓటమిని విజయానికి మెట్టుగా తీసుకోవాలని ఆయన సూచించారు. నూతన క్రీడా పాలసీ ద్వారా రానున్న రోజుల్లో రాష్ట్రంలో జాతీయస్థాయి క్రీడలతో పాటు ఒలింపిక్స్ కూడా నిర్వహించే అవకాశాలు ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. ఏపీ పునర్విభజన అనంతరం రాష్ట్రానికి నిధులు,స్థలాలు, ఆస్తులు అన్ని పోయాయని గుర్తుచేశారు. తద్వారా ఇక్కడ క్రీడా వ్యవస్థ దెబ్బతిందని, వాటిపై అధ్యయనం చేసి నేడు నూతన క్రీడా పాలసీని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ కే.రత్న షీలామణి, రిజిస్ట్రార్ సింహాచలం, క్రీడా శాఖ అధిపతి పాల్ కుమార్‌లను అభినందించారు. వీసీ గంగాధరరావు మాట్లాడుతూ గెలిచిన క్రీడాకారులను అభినందించారు. అలాగే, త్వరలో జరగనున్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రాణించి ఆయా వర్సిటీలకు పేరు తేవాలని సూచించారు. నాగార్జున వర్సిటీలో ఉన్న క్రీడా సౌకర్యాలను వినియోగించుకొని రాష్ట్ర ప్రభుత్వం పలు క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం, వ్యాయామ విద్య డైరెక్టర్, పోటీల నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, ప్రిన్సిపాల్స్ ఆచార్య జాన్సన్, ఆచార్య ప్రమీల రాణి, వెయిట్ లిఫ్టింగ్ పోటీల పరిశీలకులు బడేటి వెంకట రామయ్య, ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు సూర్య నారాయణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఒలింపిక్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కార్యదర్శి దిల్లా బాబు, ఒలింపియన్ మాణిక్యాలరావు పాల్గొన్నారు.



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న మంగళూరు యూనివర్శిటీ

ఓవరాల్ విజేత మంగుళూరు యూనివర్సిటీ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నాలుగు రోజుల పాటు జరిగిన సౌత్ వెస్ట్ జోన్ పురుషుల అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో టీం ఛాంపియన్‌షిప్‌ను మంగళూరు యూనివర్శిటీ కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో తిరువల్లూరు యూనివర్సిటీ నిలువగా, సావిత్రిబాయి పూలే యూనివర్సిటీ మూడవ స్థానంలో నిలిచింది. పోటీల చివరి రోజు ఫలితాలను పోటీల నిర్వాహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ వెల్లడించారు.

చివరి రోజు ఫలితాలు

109 కేజీల విభాగంలో మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారుడు ప్రత్యూష్ 312 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని గెలుపొందారు. జై నారాయణ వ్యాస్ యూనివర్సిటీ క్రీడాకారుడు వినోద్ లఖానీ 308 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని సాధించాడు. యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ క్రీడాకారుడు ఎన్‌పీ అమల్ కాంస్య పతకం పొందాడు.

ప్లస్ 109 కేజీల విభాగంలో

మహారాజ గంగా సింగ్ యూనివర్సిటీ క్రీడాకారుడు కేశవ్ బిస్సా 335 కేజీల బరువులు ఎత్తి బంగారు పతకాన్ని సాధించారు. మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారుడు జోష్వా రాజకుమార్ 297 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని , యోగి వేమన యూనివర్సిటీ క్రీడాకారుడు గోగులోతు రాజశేఖర్ 295 కేజీల బరువులెత్తి కాంస్య పతకం సాదించారు.

వ్యవసాయ రంగంలో పీజీ విద్యార్థినులకు స్కాలర్ షిప్‌లు

- యారాతో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒప్పందం

తాడికొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అత్యంత సంక్లిష్టమైన వ్యవసాయ విద్య వైపునకు విద్యార్థినులను మళ్లించేందుకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అడుగు ముందుకు వేసింది. వ్యవసాయ రంగంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసే విద్యార్థినులకు స్కాలర్ షిప్ లు అదించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈమేరకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బెంగుళూరుకు చెందిన అంతర్జాతీయ సంస్థ యారా ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో మంగళవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ప్రపంచ స్థాయిలో మొక్కలు పోషణకు సంబంధించి 50 దేశాల్లో విస్తరించిన ఈ సంస్థ భారతదేశంలో డిజిటల్ ఫార్మింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బెంగుళూరులో యూనిట్ ఉంది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సాయిల్ సైన్స్, క్రాప్ ఫిజియాలజీ మొదలగు సబ్జెక్టుల్లో రెండేళ్ల పాటు పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థినులకు ఈ సంస్థ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయనుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఒప్పంద పత్రాలను వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి,యారా ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మంజుల బీఎస్ మార్చుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టరు సీహెచ్ శ్రీనివాస్ రావు, డీన్ పీజీ స్టడీస్ డాక్టరు ఏవీ రమణ, డీన్ కమ్యూనిటీ సైన్స్ డాక్టరు బీ శ్రీలక్ష్మి, డీన్ ఇంజినీరింగ్ డాక్టరు ఎ.మణి, పరిశోధన సంచాలకులు డాక్టరు ఏవీ సత్యనారాయణ, సీఓఈ డాక్టరు డీ. సంపత్ కుమార్, యారాకంపెనీ ప్రతినిధి మంజుల బీఎస్, రిజిస్ట్రార్ రామచంద్రరావు, డాక్టర్ సీ.హెచ్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ ఏ.వీ.రమణ, డాక్టర్ బీ.శ్రీలక్ష్మీ, డాక్టర్ ఏ.మణి, యారా జోనల్ హెడ్ అన్షుమన్ శర్మ, విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి విశాలాక్షి, లైబ్రేరియన్ డాక్టరు పీ సాంబశివరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, తొలి రాష్ట్రపతి, మొదటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ జయంతిని విశ్వవిద్యాలయంలో నిర్వహించారు.


స్కాలర్ షిప్ ల ఒప్పందం పత్రాలను అందుకుంటున్న వీసీ శారద జయలక్ష్మి,యారా ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మంజుల

విద్యార్థిని చితకబాదిన పీఈటీ


వీపుపై వాతలు తేలి ఉండటాన్ని చూపిస్తున్న విద్యార్థి సాయిపునీత్

వేమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయుడు చితకబాదిన సంఘటన మండలంలోని చావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. ఈ సంఘటనకు సం బంధించిన వివరాలు.. ఆ పాఠశాలలో విద్యార్థి ఎస్.నాగసాయి పునీత్ 8వ తరగతి చదువు తున్నాడు. అదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా వీర్ల శ్రీనివాసరావు పనిచేస్తున్నాడు. పాఠశాల బ్రేక్ టైం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో పునీత్ తోటి విద్యార్థులతో గ్రౌండ్‌లో ఆడుకుంటున్నాడు. అదే సమయంలో వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థులందరినీ అసెంబ్లీకి రావాలని పిలిచారు. పునీత్ తోటి విద్యార్థులతో కలిసి అసెంబ్లీ ప్రాంతానికి వెళ్లాడు. అయితే, ఆలస్యంగా వచ్చావంటూ పునీత్ వీపుపై వ్యాయామ ఉపాధ్యాయుడు కొట్టాడు. దీంతో, ఆ విద్యార్థి వాంతులు చేసుకుని స్పృహ తప్పి పడిపోయాడు. కొంత సేపటి తర్వాత పక్కనే ఉన్న విద్యార్థి సోదరుడు సుజిత్‌సాయిమోహన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. పునీత్ కుటుంబ సభ్యులు పాఠశాలకు చేరుకుని విద్యార్థి పరిస్థితిని గుర్తించారు. వీపుపై వాతలు ఏమిటని ప్రశ్నించారు అందుకు వ్యాయామ ఉపాధ్యాయుడు దురుసుగా సమాధానమిచ్చాడు. దీంతో, విద్యార్థి కుటుంబసభ్యులు వేమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పీఈటీపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఆరు రైల్వేస్టేషన్లలో పార్శిల్ కార్యాలయాల మూత

- తక్షణం అమలు చేయాలని పీసీసీఎం ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన పార్శిల్ కార్యాలయాలను తక్షణం మూసి వేయాల్సిందిగా ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం ఆరు స్టేషన్లలో ఈ పార్శిల్ కార్యాలయాలు బుధవారం నుంచే మూతపడ నున్నాయి. బుకింగ్, రిసీవింగ్ రెండూ నిలిపేయనున్నారు. డివిజన్ పరిధిలో సత్తెనపల్లి, పేరేచర్ల, పిడుగురాళ్ల, నంబూరు, మాచర్ల, దిగువమెట్ట రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేసిన పార్శిల్ కార్యాలయాలకు తగిన ఆదరణ లేని కారణంగా రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సమాచారం. దీంతో, సరుకు ఎగుమతి, దిగుమతి చేసుకొనేవారు ప్రత్యామ్నాయ రైల్వేస్టేషన్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. కార్గో సేవలను విస్తరించే క్రమంలో రైల్వే శాఖ ఎక్కడికక్కడ పార్శిల్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. మిర్చి, అపరాలు, ధాన్యం, ఎరువులు, పురుగుమందులను ఎక్కువగా పల్నాడులోని వివిధ ప్రాంతాల్లో ఎగుమతి/దిగుమతి చేసుకొంటుంటారు. దీనిని పరిగణన లోకి తీసుకొని రైల్వే శాఖ పార్శిల్ కార్యాలయాలను ప్రారంభించి వీటి సేవలను వినియోగించు కోవాల్సిందిగా స్థానిక వ్యాపారులకు విజ్ఞప్తి చేసింది. అయితే, ఆశించినంత స్పందన కనిపించలేదు. సుమారు ఏడాదికి పైగానే చూసినా స్పందన లేకపోతుండటంతో పార్శిల్ కార్యాలయాలను శాశ్వతంగా మూసేయాలని నిర్ణయం తీసుకొంది.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం


భక్తులను ఉద్దేశించి సందేశం ఇస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

వట్టిచెరుకూరు, డిసెం బరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తు బోధ నలు ఆచరణీయ మని, ప్రపంచ వ్యాప్తంగా ఆ బోధనలు చేసిన పునీత శౌరి మహోన్నత వ్యక్తి అని గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య పేర్కొన్నారు. మండలంలోని ముట్లూరులో పునీత శౌరి దేవాలయ తిరునాళ్ళ మంగళవారం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం బలి పూజా కార్యక్రమానికి తరలివస్తున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్యను ముట్లూరు వెలుపల నుంచి ప్రత్యేక వాహనంపై స్థానిక దేవాలయ ఫాదర్ దిలీప్ కుమార్ సాదరంగా దేవాలయ ప్రాంగణానికి తీసుకు వచ్చారు. తొలుత ఆలయంలోని పునీతశౌరి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన నిత్య ఆరాధన మందిరాన్ని ప్రారంభించారు. దేవాలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదిక పై నుంచి వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఫాద ర్లతో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. భక్తులు సాయంత్రం కొవ్వొత్తులతో ఆలయ ప్రదక్షిణ నిర్వ హించారు. తేరు ఉత్సవం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కొన సాగింది. తిరునాళ్ళ సందర్భంగా వట్టిచెరుకూరు సీఐ రమా నాయక్, ఎస్‌ఐ సుబ్బారావు, ప్రత్తిపాడు, కాకుమాను ప్రాంతాల ఎస్‌ఐలు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

గంజాయి విక్రేత అరెస్టు

- 120 గ్రాముల గంజాయి స్వాధీనం

చిలకలూరిపేట డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం తిమ్మాపురంలో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి గంజాయి విక్రేత ఓంప్రకాష్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నరసరావుపేట ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాసమూరి, చిలకలూరిపేట ఎక్సైజ్ సీఐ కే వినయ్‌కుమార్, తమ సిబ్బందితో కలిసి సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు.

40,893 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 42, 929 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,893 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 39,454 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15000	334	7500	14500
నెంబరు. 5	8500	11200	నెంబరు.5	10000	12000
273	8000	8000	273	9500	14000
341	8000	12500	341	7500	14000
4884	14500	14500	4884	11500	11500
సూపర్ 10	10500	10500	సూపర్ 10	10000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	16300	తేజ	7500	16500
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	10500	12000
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4000	10200

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98.107.118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

ఎస్పీ చొరవతో వలస కార్మికులకు విముక్తి

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ చొరవతో 10 మంది వలస కార్మికులకు వెట్టి చాకిరి నుంచి విముక్తి కలిగింది. మహారాష్ట్రలో ఓ కాంట్రాక్టర్ వద్ద చిక్కుకున్న తమ వారికి విముక్తి కల్పించాలని కుటుంబ సభ్యులు ఎస్పీని కోరడంతో కార్మికుల విడుదల కోసం ఆయన ప్రత్యేక చొరవ చూపారు. గుంటూరు నగరం నుండి తాపీ పనుల నిమిత్తం సుమారు రెండు నెలల క్రితం 10 మంది కార్మికులు హైదరాబాదుకు వలస వెళ్ళారు. అక్కడ పనులు అయిపోవడంతో, మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని గెవ్రాయ్‌లో తాపీ పనుల నిమిత్తం వెళ్ళారు. తాపీ పనులకు బదులు డ్రైనేజీ పనులను పురమాయించి సరైనవసతి, భోజనం పెట్టకుండా సుమారు నెల రోజులుగా యజమాని వేధించాడు. పారిపోవడానికి యత్నించిన వారిని యజమాని కొట్టడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ సమా చారాన్ని కార్మికులు తమ కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు ఎస్పీని వేడు కున్నారు. వెంటనే స్పందించిన ఎస్పీ నగరం పాలెం ఎస్సై బాషా నేతృత్వం లోని ప్రత్యేక బృందాన్ని మహారాష్ట్రకు పంపి.. వారిని గుంటూరుకు తీసుకు వచ్చారు. కార్మికుల కష్టానికి తగిన వేతనం సుమారు రూ.93 వేలు కూడా యజమాని నుండి ఇప్పించారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేటి నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ స్థల సంప్రోక్షణ

దుర్గి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరు రోడ్డులో గల శ్రీఅలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ స్థలంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు సంప్రోక్షణ, శాంతిహోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 15 ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం నిలిచిపోగా తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. దీనికోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

రాజుపాలెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తహసీల్దార్ దుర్గేశ్వరరావు తెలిపారు. ఈ సదస్సులకు రైతులు హాజరై వారి సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పశుగ్రాస క్షేత్రాల పథకానికి దరఖాస్తు చేసుకోండి : డాక్టర్ శ్వేతాదేవి

అచ్చంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం పెంచుకోవాలనే రైతులు ఐదెకరాల లోపు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చునని వెటర్నరీ డాక్టర్ శ్వేతాదేవి మంగళవారం తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలు పెంచుకొనే రైతులు పశుగ్రాసం కోసం తమ సొంత భూమిలో గడ్డి పెంచుకోవటానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. పశుగ్రాస క్షేత్రాలు అనే పథకం కింద పశు సంవర్ధక శాఖ, ప్రభుత్వం సంయుక్తంగా నగదును అందిస్తుందన్నారు. పది సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు మాత్రమే పెంచుకోవాలని, ఐదెకరాల లోపు రైతులు సన్న, చిన్న కారు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు మాత్రమే దీనికి అర్హులని తెలిపారు.

బోగస్ పింఛన్లపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ నేతల వినతి

గురజాలటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బోగస్ పింఛన్లపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పల్లెగుంత టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షేక్ గౌసియాబేగంకు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన సొంగ అమరమ్మ భర్త ఉండి కూడా ఒంటరి మహిళ పింఛన్ తీసుకుంటుందన్నారు. అలాగే గ్రామంలో సుమారు 35 బోగస్ పింఛన్లు ఉన్నాయని, వాటిపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో టీడీపీ నేతలు జాస్తి ప్రకాష్, వెంకటరామయ్య, చిన బ్రహ్మయ్య, కాపర్తి సైదులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

దాచేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని మోడల్ స్కూల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సౌందర్‌రాజన్, ప్రిన్సిపాల్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 587.10 అడుగులు ఉంది. ఇది 305.56 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8717 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4881 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 16,727 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 32,125 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 29,396 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళ వారం 41.44 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి ఐదు వందల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతుంది.

మరకత లింగ చంద్రమౌళేశ్వరుడికి పూర్ణాహుతి, త్రిశూల స్నానం


మరకతలింగ చంద్రమౌళేశ్వర స్వామి విశ్వరూప దర్శనం

నకరికల్లు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసింగ పాడులో ఉన్న గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా పూర్ణహుతి నిర్వహించి, త్రిశూల స్నానం ఆచరించారు. మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి విశ్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ దర్మకర్త పమిడిమర్రి శ్రీనివాసశర్మ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో తిరువీధుల శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.

నరసింహారావు మృతి బాధాకరం

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మండడి నరసింహారావు మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నరసింహారావు మృతదేహాన్ని మంగళవారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మక్కపాటి రామచంద్రరావు, కోమటినేని శ్రీనివాసరావు, మండడి బాబు తదితరులున్నారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మాచర్ల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎక్సైజ్ అధికారులు మంగళవారం వెల్దుర్తి మండలం గుండ్లపాడులో దాడులు జరిపారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా కలిగి ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రస్తుత మార్కెట్ ధర చెల్లిస్తేనే పైపులైన్‌కు సహకరిస్తాం

● నరసింగపాడు గ్రామ రైతులు
● రెవెన్యూ అధికారులు, పీబీసీఎల్ ప్రతినిధులతో సమావేశం


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, బీపీసీఎల్ ప్రతినిధులు

నకరికల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత మార్కెట్ ధర చెల్లించినట్లయితే పైపులైన్‌కు సహకరిస్తామని నరసింగపాడు రైతులు రెవెన్యూ అధికారులకు, పీబీసీఎల్ ప్రతినిధులకు చెప్పారు. మంగళవారం నకరికల్లు మండలం నరసింగపాడులో రైతులతో రెవెన్యూ, పీబీసీఎల్ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వరకు పైపులైన్ నిర్మాణంలో భాగంగా 47 మంది రైతులకు చెందిన 11.56 ఎకరాలకు పైగా భూమి ఈ పైపులైన్‌కు అవసరం కానుంది. కాగా ఒక్కో సెంటుకు రూ.2 వేలు ఇచ్చే విధంగా కంపెనీ ప్రతినిధులు రైతులకు తెలిపారు. అందుకు రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. ప్రస్తుత మార్కెట్ ధర రూ.50 లక్షలు ఉండగా ఎకరాకు రూ.2 లక్షల మేర పరిహారం ఇచ్చేట్లయితే తాము నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక తమ పొలం అమ్ముకోవాలన్నా, బోరు వేసుకోవాలన్నా, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని, తమ సమస్యలను రైతులు ఏకరువు పెట్టారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రైతుల ప్రతిపాదనలను ప్రభుత్వానికి తెలియజేస్తామని రెవెన్యూ అధికారులు, పీబీసీఎల్ ప్రతినిధులు తెలిపారు.

మార్కెట్ ధర చెల్లించాలి : బిజ్జం లక్ష్మారెడ్డి



ప్రస్తుత మార్కెట్ ధర నరసింగపాడులో ఎకరం రూ.50 లక్షలు పలుకుతుంది. రెండు లక్షల పరిహారానికి మేము అంగీకరించం, రైతుల కోణంలో నుంచి చూసి తగు న్యాయం చేయాలి.

ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది

● అవుల గోపాలరెడ్డి



పైపులైన్‌కు పొలం ఇవ్వటం ద్వారా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. భూమి అభివృద్ధి చేసుకోవాలన్నా ఈ కంపెనీ ప్రతినిధులతో సమస్యలు తలెత్తుతాయి. మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

పరిహారం సక్రమంగా ఇవ్వకపోతే భూములు ఇవ్వలేం : నుసుం నారాయణరెడ్డి



పైపులైన్ నిర్మాణం కోసం పరిహారం సక్రమంగా ఇవ్వకపోతే భూములను ఇవ్వలేం. ఇప్పుడు నచ్చజెప్పి భూములు తీసుకుంటే తరువాత మమ్మల్ని పట్టించుకొనేదెవరు?, భూములకు సరిపడ నష్టపరిహారాన్ని ఇవ్వాలి. పరిహారం సక్రమంగా ఇవ్వకపోతే భూములు ఇచ్చే ప్రసక్తే లేదు.

వైసీపీ ప్రభుత్వంలో నా భూమినే రాయించుకున్నారు

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


నెమలిపురిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇప్పుడు కూడా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చియుంటే ఎవరి భూమి వారికి ఉండేది కాదు. భూములన్నీ కూడా వాళ్లే రాయించుకునే వాళ్లు. అంతెందుకు వైసీపీ ప్రభుత్వంలో నా భూమే రాయించుకున్నారు. ఇక ఎవరి భూమికి దిక్కు ఉండేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని నెమలిపురిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా హజరైన కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఈ రోజు నుంచి 2024-25ఖరీఫ్ సీజన్లో పండించిన పంటను రైతుల నుంచి రైతు సేవాకేంద్రాల ద్వారా మంచి రకాలకు 75కేజీల బస్తా రూ.1740కు కొనుగోలు చేస్తారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎవరి భూమికి కూడా గ్యారెంటీ లేదని ఎవరి భూమి ఎవరు రాయించుకుంటారో తెలియదన్నారు. గత ప్రభుత్వంలో భూ అక్రమాలు ఎక్కువగా జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి సుశీల, సత్తెనపల్లి ఆర్‌డీవో రమా కాంత్‌రెడ్డి, జీడీసీఎంఎస్ బీఎం హరగోపాల్, ఏడీఏలు, తహసీల్దార్ దుర్గేశ్వరావు, ఎంపీడీవో సత్యానారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట నరసయ్య మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, శనగపూల నరసింహారావు, చిన్నబోయిన రాఘవరావుయాదవ్, బెల్లంకొండ వాసు, నరసింహారావు, సర్పంచులు తదితరులు ఉన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

సత్తెనపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు టీడీపీ సభ్యత్వం తీసుకుంటే పార్టీ బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో మంగళవారం సాయంత్రం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకోవటం వల్ల రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా అందు తుందన్నారు. నియోజకవర్గ పరిశీలకులు తాతాజయ ప్రకాష్ నారాయణ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదుకు నియోజకవర్గంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు కన్నా చేతుల మీదుగా పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, మారెళ్ళ మల్లేశ్వరరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, మారెళ్ళ స్వామి, జింకా లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పించాలి

ముప్పాళ్ళ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జులు ఐకమత్యంగా ఉండి ఎక్కువ మందిని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులుగా చేర్పించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ముప్పాళ్ళలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కన్నా మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులందరూ ఐకమత్యంగా ఉండి ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ ఫలాలను అందించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, బత్తుల నాగేశ్వరరావు, అత్తోట వెంకట కృష్ణారావు, తెల్లజర్ల వెంకటేశ్వర్లు, గోగినేని కోటేశ్వరరావు, మధుబాబు, గోపాలరావు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు మనోధైర్యాన్ని కల్పించాలి

● డీఈవో ఎల్ చంద్రకళ


మాచవరం ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్ఎం పద్మజ

క్రోసూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతిఒక్కరు విభిన్న ప్రతిభావంతులకు మనోధైర్యాన్ని కల్పించాలని పల్నాడు డీఈవో ఎల్ చంద్రకళ అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, దివ్యాంగులకు, విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉండాలని ఆమె చెప్పారు. మంగళవారం క్రోసూరు జడ్పీ హైస్కూల్లోని భవిత సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల కోసం భవిత సెంటర్లో ఉన్న సౌకర్యాలు, అమలు చేస్తున్న విధానాలను పరిశీలించారు. భవిత సెంటర్ స్పెషల్ ఎడ్యుకేటర్ నసీమా బేగం, ఐఈ ఆర్‌పీ శ్వేత, వెంకట రత్నం, కంప్యూటర్ ఆపరేటర్ జెరీనా, సీఆర్‌పీ సత్తార్, ఫిజియో థెరపిస్టు కుమారిలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

దివ్యాంగులను ఆదరించాలి : ఎంఈవో

బెల్లంకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు దివ్యాంగులను ఆదరించాలని ఎంఈవో బాల చంద్రరావు అన్నారు. బెల్లంకొండ ఉర్దూ పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి, పెదకూరపాడు (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని అమరావతి, పెదకూరపాడు మండలాల్లోని భవిత కేంద్రాల్లో వేడుకలు నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు శివబాబు, టీ సత్యనారాయణలు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో ఉండాలి : హెచ్ఎం

మాచవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులతో సమాజంలోని ప్రతిఒక్కరు సత్ప్రవర్తన కలిగి ఉండాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్ తెలియజేశారు. మాచవరంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈడీ కో-ఆర్డినేటర్ ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయురాలు భార్గవి, ప్రధానోపాధ్యాయులు జయప్రద, శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదుకుంటాం

● సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

దాచేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంతో గురజాల సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు మంగళవారం దాచేపల్లి నగర పంచాయతీలోని నారాయణపురం ఫాతిమా మాత విభిన్న ప్రతిభావంతుల పాఠశాలను సందర్శించారు. కాసేపు విద్యార్థులతో గడిపిన న్యాయమూర్తి శ్రీనివాసరావు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గురజాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షుడు షేక్ జానీబాషా, సయ్యద్ లాల, పాఠశాల హెచ్ఎం సిస్టర్ అమలాకుమారి, ఫాతిమా తదితరులున్నారు.

● దాచేపల్లి ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగుల సంఘం నాయకులు షేక్ నాగుల్‌మీరా, చిలుముల దుర్గారావు తదితరులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు సదరన్ సర్టిఫికెట్ దరఖాస్తులు, ఆర్టీసీ బస్ పాస్‌లను పంపిణీ చేశారు.

పిడుగురాళ్ల (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం స్థానిక ప్రత్యేక అవసరాల కలిగిన పాఠశాలలో నిర్వహించారు. కమిషనర్ శ్రీధర్, డీఎల్‌డీవో గబ్రూనాయక్, ఎంపీడీవో రామచంద్రరావు, ఎంఈవోలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ దయాసాగర్‌లు పాల్గొన్నారు.

సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి): స్థానిక భవితకేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియో థెరపి, స్పీచ్ థెరపి, స్పెషల్ ఎడ్యుకేషన్‌ను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాటు లీగల్ అడ్వయిజర్ దివ్వెల శ్రీనివాస్, సుభానీ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్భా గాంధీ పాఠశాలలో డీఈవో సందర్శన


కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

క్రోసూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా డీఈవో ఎన్ చంద్రకళ మంగళవారం క్రోసూరులోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో తరగతి గదుల నిర్వహణను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినుల హాస్టల్‌ను వంట గదులను, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. 10వ తరగతి, ఇంటర్ విద్యార్థినులు పబ్లిక్ పరీక్షల కోసం కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మంచి మార్కులు వచ్చేటట్టు ప్రణాళిక రూపొందించాలని, వందశాతం ఫలితాలు సాధించాలని ఆమె అన్నారు. అనంతరం విద్యార్థినుల సామర్థ్యాలను పరీక్షించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, ఎంఈవో - 2 గణేష్, పలువురు ఉపాధ్యాయులున్నారు.

● జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని డీఈవో ఎల్ చంద్రకళ మంగళవారం పరిశీలించారు. మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎండీఎం నిర్వాహకులకు కొన్ని సూచనలు చేశారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.

ఏపీఆర్‌డీసీలో 'మీలో మేము - మీతో మేము'

మాచర్ల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల ఏపీఆర్‌డీసీ కళాశాలలో మంగళవారం విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి ఆధ్వర్యాన 'మీలో మేము - మీతో మేము' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, ర్యాగింగ్‌ల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి, డిప్యూటీ వార్డెన్ నయీమ్ ఖాను, డాక్టర్ సతీష్ బాబు, విజయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **మాచవరం (ఆంధ్రజ్యోతి):** మాచవరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో మీతో మేము కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు : ఎస్ఐ

బెల్లంకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని బెల్లంకొండ ఎస్ఐ ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ జూనియర్ కళాశాలలో మీతో మేము అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎస్పీ శ్రీనివాసరావు ఉత్తర్వుల మేరకు సత్తెన పల్లి డీఎస్పీ, పెదకూరపాడు సీఐల పర్యవేక్షణలో కళాశాలలో సమావేశం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ గురించి వివరిస్తున్నట్టు తెలిపారు. డ్రగ్స్ గురించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ గురించి వివరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, బాలికా సంరక్షణ మండల నోడల్ అధికారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి డబ్ల్యూహెచ్‌వో టీమ్

మాచవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాచవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డబ్ల్యూహెచ్‌వో టీమ్ సభ్యులు సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్తుల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం లయోల ప్రేమ నివాసంలో విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న విద్యార్థుల యోగ క్షేమాల గురించి విచారించారు. పీహెచ్‌సీని సందర్శించిన వారిలో డాక్టర్ భవానీ, మురళీకృష్ణ, జిల్లా క్షయ అధికారి అరుణ, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత


దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న అధికారులు

క్రోసూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలతో మండలంలోని పెరికపాడు గ్రామానికి చెందిన ఆముదాల పాటి బెన్నియ్యకు జిల్లా అధికారులు మంగళవారం ట్రై సైకిల్‌ను అందజేశారు. గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు జడ సుబ్బు దివ్యాంగుడికి ట్రై సైకిల్ కావాలనే విషయాన్ని ఇటీవల జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు విజ్ఞాపన రూపంలో అందజేశారు. స్పందించిన కలెక్టర్ బెన్నియ్యకు ట్రై సైకిల్‌ను అధికారుల ద్వారా అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి పాల్గొన్నారు.

రాజనీతిజ్ఞురాలు నాయకురాలు నాగమ్మ



నాగమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన పల్నాడు అభివృద్ధి కమిటీ సభ్యులు

దాచేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాటి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దాచేపల్లి నగర పంచాయతీలోని మాచర్ల టర్నింగ్ వద్ద ఉన్న నాయకురాలు నాగమ్మ విగ్రహానికి పల్నాడు అభివృద్ధి కమిటీ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకురాలు నాగమ్మ దాచేపల్లి మండలంలోని గామాలపాడులో పుట్టి పెరిగిన నాయకురాలు నాగమ్మ గురజాల రాజధానిగా చేసుకొని మహిళా ప్రధానిగా చేపట్టి అనేక అభివృద్ధి పనులు చేశారని వివరించారు. దీనిలో భాగంగానే గురజాలలో నాగమ్మ నిర్వహించిన చెరువు నేటికీ శతాబ్దాలు గడుస్తున్నా ప్రజలకు దాహార్తిని తీరుస్తుందని తెలిపారు. ప్రజలకు తాగునీరు, రహదారులు ఉండాలని ఆమె చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో బెహరా వెంకట శ్రీనివాసరావు, మందా బెంజిమెన్, కని గిరి విశ్వనాథం, కౌన్సిలర్ షరీఫ్, గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు తదితరు లున్నారు.

నేత్ర వైద్యశాల అభివృద్ధికి రూ.20 లక్షల విరాళం


ఆస్పత్రి పాలకవర్గంతో డాక్టర్ పీఎస్సార్ ఆంజనేయులు

మాచర్లటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాగరు రోడ్డులో గల డాక్టర్ పీఎస్సార్ ఆంజనేయులు మీనాక్షి నేత్ర వైద్యశాల అభివృద్ధికి వైద్యశాల వ్యవస్థాపకుడు డాక్టర్ పీఎస్సార్ ఆంజనేయులు రూ20 లక్షలను విరాళంగా అం దించారు. మంగళవారం ఆయన వైద్యశాలను సందర్శించి వైద్యసేవలను కొనియాడుతూ పాలకవర్గాన్ని, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీఎస్సార్ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో నూతనంగా ప్రా రంభించిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇప్పటికి సుమారు 3600 కంటి చికిత్సలు నిర్వహించారన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతోపాటు నిష్ణాతులైన వైద్యసి బ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య, కార్యదర్శి మురహరిరావు, డైరెక్టర్లు చెరుకూరి నరసింహారావు, కర్నాటి శ్రీనివాసరావు, ఎం లక్ష్మీనారాయణ, ఎస్ గోపిరెడ్డి, బీ వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల స్థలానికీ రక్షణ కరువు

సత్తెనపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలీసు సర్కిల్ స్థలానికి దాత ఇచ్చిన స్థలాన్ని కాజేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. పట్టణంలోని వడ్డవల్లిలో సర్వే నెంబరు 23-1 ఏ/2లో పది సెంట్ల స్థలాన్ని దాత అహోబిల భాస్కరరావు 1951లో సత్తెనపల్లి పోలీసుసర్కిల్ కార్యాలయానికి దానంగా ఇచ్చారు. అప్పటి నుంచి ఆ స్థలం ఖాళీగానే ఉంటుంది. 2005లో ఈ స్థలాన్ని కాజేసేందుకు కొంత మంది ప్రయత్నించినప్పటికీ అప్పటి ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి అడ్డుకున్నారు. ప్రస్తుతం అహోబిల భాస్కరరావు కుమారుడు విజయ వెంకటలక్ష్మీ నరసింహారావు స్థలం తమదేనని, తన తండ్రి దానం ఇచ్చారని, మధ్యవర్తుల ద్వారా స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టా డు. ముప్పాళ్ళ మండలం రుద్రవరంనకు చెందిన బ్రోకర్ కోటేశ్వ రరావు ద్వారా సత్తెనపల్లికి చెందిన ధూపగుంట్ల జానకీ రామారావుకు విక్రయించేందుకు నిర్ణయించారు. రామారావు దగ్గర రూ.2.50 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకొని అగ్రిమెంట్ రాశారు. ఈ స్థలం రెవెన్యూ రికార్డుల్లో 22ఏ జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్ కాలేదు. దీంతో బ్రోకర్ కోటేశ్వరరావు పట్టణానికి చెందిన సంపత్‌కుమార్‌కు సర్వే నెంబరు మార్పు చేసి లక్ష్మీనరసింహారావు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ చేశాడు. ఈ నేపథ్యంలో రామారావు తనకు అగ్రిమెంట్ చేసి మరొకరికి స్థలాన్ని జీపీఏ చేయించటం ఏమిటని? ప్రశ్నించారు. ఇద్దరి మధ్య సోమవారం సాయంత్రం వివాదం జరగటంతో ఇరువురు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవటంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ స్థలం 22 జాబితాలో ఉందని, తొలగించాలని లక్ష్మీనరసింహారావు గత నెల 18వ తేదీన తమకు దరఖాస్తు చేయగా దానిని తిరస్కరించినట్టు తహసీల్దార్ చక్రవర్తి మంగళవారం తెలిపారు. స్థలం పోలీసుశాఖకు చెందినదనేది రికార్డు పూర్వకంగా వడ్డవల్లి సచివాలయంలో ఉంది. దీనిపై సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. పట్టణ సీఐ బ్రహ్మయ్య ఈ విషయంపై విచారణ జరుపుతున్నారు.

ఆక్రమణకు గురైన స్థలం పంచాయతీకి అప్పగింత

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేత చేతిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం మండల అధికారులు స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించారు. వివరాల్లోకి వెళితే మండల పరిధి లోని లేమల్లె గ్రామంలో హిందూ శ్మశానవాటికి సమీపంలో సుమారు 12 సెంట్ల స్థలాన్ని స్థానిక వైసీపీ నేత ఒకరు ఆక్రమించుకుని పశువుల పాకా వేసి అనుభవిస్తున్నాడు. శ్మశానానికి చెందిన కొంత, చుక్కల భూమికి చెందిన కొంత భూమిని ఆక్రమించుకున్నట్లు అధికారులు గుర్తించారు. గ్రామపంచాయతీ అధికారి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సీఐ ఎం శ్రీనివాసరావు తమ సిబ్బందితో వెళ్లి ఆ స్థలాన్ని ఖాళీ చేయించి పంచాయతీకి అప్పగించారు.

25వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

మాచవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6, 7, 8 తేదీల్లో జరగనున్న పల్నాడు జిల్లా సీపీఎం 25వ మహా సభలను జయప్రదం చేయాలని పిడుగురాళ్ళ, మాచవరం మండలాల సమన్వయ కమిటీ కన్వీనర్ తెలగపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మాచవరంలో జరిగిన కార్యక్రమంలో మహాసభలకు సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సీపీఎం జిల్లా మహాసభలు నరసరావుపేటలో జరుగుతున్నాయని, పల్నాడు జిల్లాలోనే అన్ని గ్రామాల నుంచి సీపీఎం నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు మంగళవారం పట్టణంలోని 29వ వార్డు ఆజాద్ నగర్, పదో వార్డు రింగురోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రం, కూరగాయల మార్కెట్, సైడు కాలువలను పరిశీలించారు.

వైద్యసేవలు సక్రమంగా అందించాలి : డీఎంహెచ్‌వో

నకరికల్లు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బీ రవి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నకరికల్లు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆశా డే లో భాగంగా ఆశా కార్యకర్తలతో, ఏఎన్ఎంలతో, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. చేపట్టాల్సిన కార్యచరణ గురించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ బీ మణికంఠ, వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఉన్నారు.

సెల్ ఫోన్‌లపై అవగాహన కలిగిఉండాలి : సీఐ

అచ్చంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సెల్ ఫోన్‌ల వాడకంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అచ్చంపేట సీఐ కే వెంకటప్రసాదు అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్ళచెరువులో సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో సెల్‌ఫోన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల గురించి వివరించారు. వాటికి బానిసలుగా మారి జీవితాలను బలి చేసుకుంటున్న యువత గురించి విద్యార్థులకు వివరించారు.

కోడిపోరు

పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కోడిపోరు రసవత్తరంగా సాగింది. మాచర్ల వైపు అలనాడు నాగమ్మ, బ్రహ్మనాయుడు తమ రాజ్యాలను పణంగా పెట్టి కోడిపోరులో తలపడిన సంఘటనలను గుర్తుచేస్తూ నిర్వహించిన కోడిపోరు ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది. మాచర్ల కోడి చిట్టుమల్లు, గురజాల కోడి శివంగిడేగలు తలపడ్డాయి. అంతకుముందు, వీరాచారవంతుల గ్రామోత్సవం, బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద కత్తిసేవ జరిగాయి.





బ్రహ్మనాయుడు కోడి చిట్టిమల్లును చేబూనిన మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

- వీరారాధన ఉత్సవాల్లో నాలుగో రోజు
- మాచర్ల కోడితో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి
- గురజాల కోడితో గుడివాడ ఎమ్మెల్యే రాము

కారంపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో నాలుగో రోజు మంగళవారం కోడిపోరు రసవత్తరంగా సాగింది. తొలుత పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారును మేళతాళాలతో ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా కోడిపోరు ప్రదేశానికి తీసుకొచ్చారు. నాయకురాలు నాగమ్మ వేషంను యాదవ వీరాచార వంతుడు కట్టాడు. బ్రహ్మనాయుడుగా పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు కూర్చున్నారు. మాచర్ల వైపు బ్రహ్మనాయుడు తరపున శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మనందరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్, వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు నిలబడ్డారు. గురజాల వైపు నాయకురాలు నాగమ్మ తరపున పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నిలబడ్డారు. మాచర్ల కోడి చిట్టుమల్లును బ్రహ్మనందరెడ్డి, గురజాల కోడి శివంగిడేగను రాము చేతబట్టారు. అనంతరం కోళ్లను పందేనికి ఉసిగొల్పారు.





పందెం పుంజులతో ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, భాష్యం ప్రవీణ్





ఊరేగింపుగా వస్తున్న పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవ అయ్యవారు

నాగమ్మ కుట్ర..

అనాడు మాచర్ల రాజ్యాన్ని కైవసం చేసుకోవడానికి నాగమ్మ కుట్ర పన్ని కోడి పందేనికి బ్రహ్మనాయుడును ఉసిగొల్పుతుంది. జూద వ్యసనుడైన బ్రహ్మ నాయుడు ఈ పందేనికి సిద్ధమవుతాడు. తొలి, మలిపందెంలలో బ్రహ్మనాయుడు కోడి చిట్టి మల్లు గెలువగా, ముచ్చటగా మూడో పందెం వేద్దామని నాగమ్మ పట్టుబట్టింది. ఈ పందెంలో ఓడిన వారు పద్నాలుగేళ్ల రాజ్యాన్ని వదిలి అరణ్యవాసం చేయాలని నిబంధన పెట్టింది. నాగమ్మ నాడు నల్గొండ నుంచి తెప్పించిన శివంగి డేగ ఈ పందెంలో చిట్టిమల్లు ధాటికి తట్టుకోలేకపోతోంది. అప్పటికే గంగవరం కట్టుబోతుల వారిని పిలిపించిన నాగమ్మ మంత్రాక్షితలు చిట్టుమల్లుపై చల్లమని ఆదేశిస్తోంది. బ్రహ్మనాయుడు చూపు కోడిపై ఉన్నంత వరకు మంత్రాక్షితలు పనిచేయవని కట్టుబోతుల వారు చెబుతారు. ఆయన చూపు మరల్చడానికి నాగమ్మ తన చీరపై కుంకుడు బురుజు పోసుకొని బహిష్టయినట్లు నాటకం ఆడుతుంది. దీక్షాపరుడైన బ్రహ్మనాయుడు బహిష్టయిన వారి మొహం చూడకూడదని మొహం తిప్పుకుంటాడు. కట్టుబోతుల వారు బ్రహ్మనాయుడు కోడి అయిన చిట్టిమల్లుపై మంత్రాక్షితలు చల్లుతారు. దీంతో, చిట్టిమల్లు నేలకొరుగుతుంది. నాగమ్మ కోడి గెలిచినట్లు ప్రకటిస్తారు. బ్రహ్మనాయుడు అరణ్యవాసానికి వెళ్లాలని నిర్ణయిస్తారు. ఈ పోరు తిలకించడానికి వచ్చిన ప్రజలు ఆసనాలుగా ఉపయోగించిన రాళ్లు ఇప్పటికీ రెంటచింతల మండలం పాలువాయి వద్ద గుట్టలుగా ఉన్నాయి.



కొణతాల ఊరేగింపు

వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులు తమ పూర్వీకుల ఆయుధాలకు గంగధార మడుగులో స్నానమాచరింపజేసి అలంకరించి చెన్నకేశవ, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించి గ్రామోత్సవం జరిపారు. బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద కత్తిసేవ చేశారు. పీఠాధిపతితో కోడిపోరు సంఘటనా స్థలానికి వీరాచారవంతులు తమ కొణతములతో వచ్చి నిలబడ్డారు. ఈ కార్యక్రమంలో వీరాచార పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, మండల మాజీ అధ్యక్షుడు బొల్నేడి శ్రీనివాసరావు, బీసీ సెల్ నేత గోరంట్ల నాగేశ్వర రావు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులు పాల్గొన్నారు.

గుంటూరు రైల్వే డివిజన్‌లో నేటి నుంచి గుర్తింపు సంఘాల ఎన్నికలు

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా బుధవారం నుంచి గుర్తింపు సంఘాల ఎన్నికలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ నెల 4, 5, 6 తేదీల్లో రైల్వే శాఖ ఏర్పాటు చేసిన కార్యాలయాల్లో ఎన్నికలు జరుగుతాయి. సుమారు 4 వేల మందికి పైగా ఉద్యోగులు ఓటుహక్కుని వినియోగించుకోనున్నారు. కాగా ఈ మూడు రోజుల్లో ఆన్‌డ్యూటీలో ఉండే సిబ్బంది కోసం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించారు. గుర్తింపు కోసం మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఇప్పటికే రెండు యూనియన్‌లకు చెందిన రాష్ట్ర, జాతీయ నేతలు గుంటూరుకు వచ్చి ప్రచారం కూడా నిర్వహించారు. ఎన్నికల్లో తమను గెలిపిస్తే ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలిక డిమాండ్‌లను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీలు గుప్పించారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు ఏ యూనియన్ వైపు మొగ్గుచూపుతారో ఓట్ల లెక్కింపు జరిగే రోజున తేలి పోనుంది.

రేషన్ దందా..

రూ.32 కోట్లు

(5వ పేజీ తరువాయి)



ప్రజలు భావించారు. అయితే అప్పటి లాగానే బియ్యం నల్లబజారుకు తరలిపోతోంది. నాడు ప్రతిపక్షంలో విమర్శలు చేసిన నేతలు నోరు మెదపకపోవడం, కొన్ని దగ్గర్ల వారే రేషన్ మాఫియాకు అండగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. అక్రమార్కులు పోటీ పడిన ప్రాంతాల్లో బియ్యానికి ఎక్కువ ధర లభిస్తున్నట్లు సమాచారం. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో తనిఖీలు చేసి వందలాది క్వింటాళ్ల బియ్యం నిల్వలను గుర్తించారు. ఈ కేసులను అధికారులు నీరుగార్చారన్న విమర్శలున్నాయి. 6(ఏ) కేసులతో చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలున్నాయి. బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకున్న మిల్లుల విద్యుత్ బిల్లులు.. ధాన్యం కొనుగోలు రికార్డులు పరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉన్నా ఈ దిశగా అధికారులు స్పందించలేదని విమర్శలున్నాయి. మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తించిన బియ్యం నిల్వల విషయంలోనే అధికారులు మొక్కుబడి చర్యలు తీసుకోవడంతో బ్లాక్ మార్కెట్‌కు అడ్డంకి లేకుండా పోయిందన్న వాదన ఉంది. నరసరావుపేట మండలం ములకలూరులో రెవెన్యూ అధికారులు ఓ డీలరు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఉండాల్సి నిల్వ కన్నా అధికంగా బియ్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. ఇదేలా సాధ్యమని అధికారులు లోతుగా పరిశీలిస్తే బియ్యం నిల్వలు డీలర్ వద్దకు చేరిన వెంటనే కార్డుదారులకు నగదు బదిలీ చేసి వేలిముద్రలు తీసుకున్నట్లు తేలింది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర పరిధిలోని నల్గొండ పోలీసులు 500 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోగా వాటి మూలాలు బాపట్లలో ఉన్నాయనేది విచారణలో తేలింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల వ్యవధిలోనే రేషన్ మాఫియా అక్రమార్కులపై బాపట్ల జిల్లాలో 48 వరకు 6ఏ కేసులు నమోదు చేశారు. అయితే ఇవన్నీ మొక్కుబడి కేసులు తప్పితే వీటివల్ల అక్రమార్కులు భయపడే పరిస్థితే లేదు. గత ప్రభుత్వంలో విజయకృష్ణన్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు రేషన్ మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తున్న ముగ్గురిపై పీడీ యాక్టు ప్రతిపాదనలను ఎస్పీ కార్యాలయానికి పంపగా రాజకీయ ఒత్తిళ్లతో ఆ ప్రతిపాదనలకు సమాధి కట్టారు తప్పితే ఇప్పటికీ ఆచరణ దాల్చలేదు.

అధికారులపై ఒత్తిళ్లు.. దాడులు

బియ్యం అక్రమ వ్యాపారం, బియ్యం రీసైక్లింగ్ జరిగే మిల్లుల చిరునామాలతో సహా సమాచారం ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడరు. కొందరు అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నా కొందరు అధికారులు బియ్యం బ్లాక్ మార్కెట్‌పై స్పందించి తనఖీలు నిర్వహించినా చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. బ్లాక్ మార్కెట్ చేస్తోంది అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో అధికారులు మిన్నకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. మండలం, నియోజకవర్గం గంపగుత్తగా మాట్లాడుకుని నిర్ణీత మొత్తం కీలక నాయకుడికి చెల్లించేలా రేషన్ దందా నడుస్తోంది. అడపాదడపా దాడులకు వెళ్లిన అధికారులపై ఒత్తిళ్లు తెస్తుండగా మాట వినని వారిపై ఎదురుదాడికి దిగుతున్నారు. కొన్ని రోజుల క్రితం నిజాంపట్నం పరిధిలో బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో అధికారులు తనిఖీలకు వెళ్లగా వారిని నిలువరించే సాహసానికి అధికారపార్టీ ద్వితీయశ్రేణి నేతాగణం చేసిందంటే రేషన్ దందా ఆగడాలు ఏ విధంగా శృతిమించాయో అర్థమవుతోంది. అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఈ మాఫియాకు కర్త, కర్మ, క్రియ అంతా అమాత్యుల అనుచరగణమేనన్న విమర్శలున్నాయి. ఇక్కడ తనిఖీలకు వెళ్లిన అధికారులకు వాహనాలను అడ్డుపెట్టి గతంలో విచ్చలవిడితనం ప్రదర్శించారు. బాపట్లలో ప్రారంభంలో రేషన్ మాఫియా ఆగడాలను అరికట్టడంపై అధికారులకు స్వేచ్ఛ ఇచ్చినా తర్వాత ఇక్కడ కూడా తిలాపాపం తలా పిడికెడు అన్న చందానే తయారైంది. పర్చూరు నియోజకవర్గంలో రేషన్ దందా వైసీపీ హయాంలో ఓ వెలుగు వెలిగింది. గత ప్రభుత్వంలో ఈ ఒక్క నియోజకవర్గ పరిధిలోనే 200 వరకు 6ఏ కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వేమూరు, చీరాలలో సైతం రేషన్ దందా వర్థిల్లుతూనే ఉంది.

గతంలో వైసీపీ.. ఇప్పుడు కూటమి..

వైసీపీ హయాంలో పెద్దఎత్తున బియ్యం బ్లాక్ జరిగింది. అదే వరవడిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అక్రమార్కులు కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం పేదల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు పూర్తిగా నిరోధిస్తుందని ప్రజలు భావించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా బియ్యం బ్లాక్ మార్కెట్‌ను నిరోధించలేక పోవడంతో ప్రజల్లో పాలకులపై నమ్మకం సన్నగిల్లుతోంది. తెనాలికి చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలసి కాకినాడ పోర్టులో తనిఖీలు నిర్వహించి వేలాది టన్నుల బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముడుపులతో మౌనం..

బియ్యం అక్రమ వ్యాపారంలో నెల నెలా రూ.కోట్లల్లో ముడుపులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో రెండు మూడు నియోజకవర్గాలు మినహా అన్ని చోట్ల అధికార పార్టీ నేతలు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాల ప్రచారం. ఒక చోట బియ్యం అక్రమ వ్యాపారం నిర్వహణకు నెలకు రూ.27 లక్షలు చెల్లిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరి కొన్ని చోట్ల నెలకు రూ.20 లక్షల వరకు చేతులు మారుతున్నట్లు సమాచారం. కొన్ని శాఖల అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఒక శాఖలోని కొందరు అధికారులకు ఒక్కొక్క చోట నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మరో శాఖకు సంబంధించి నెలకు ఒక్కొక్క చోట నెలకు రూ.50 వేల వరకు ఇస్తున్నారని ప్రచారం.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని సీసీఐ కేంద్రాల్లో (కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా)నిత్యం ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంది. తాజాగా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసిన పత్తి జిన్నింగ్ మిల్లుల్లో విత్తనాల నిల్వ లు పేరుకు పోవటం పెద్ద సమస్య గా పరిణమించింది. సీసీఐ జిన్నింగ్ ప్రక్రియ ఆరంభించిన తర్వాత చాలా మిల్లుల్లో విత్తనాలు అమ్మక పోవటం తో రోజు వారీ ఉత్పత్తి కార్యకలాపాలు స్తంభించి పోయాయి.దీని ప్రభావం వల్ల కొన్ని కేంద్రాల్లో కొనుగోలు కు తాత్కాలికం గా బ్రేక్ పడింది.

సీసీఐ కేంద్రాల్లో

విత్తనాల గోల

- మిల్లుల్లో పేరుకుపోయిన 73100 క్వింటాళ్ల నిల్వలు
- జిన్నింగ్ ప్రక్రియకు తీవ్ర ఆటంకం
- ధర పెంచటంతో కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
- కాటన్ అసోసియేషన్ లేఖతో స్పందించిన సీఎండీ

గుంటూరు సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేసిన పత్తిని వెంటనే జిన్నింగ్ చేస్తారు. ఈ పద్ధతిలో ప్రతి రోజు వచ్చిన దూదిని బేళ్లగా మార్చి గోడౌన్ కు పంపుతారు. విత్తనాలను మాత్రం ఏ రోజుకి ఆ రోజు విక్రయిస్తారు. విత్తనాలు విక్రయించే ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. సీసీఐ చెప్పిన ధరకు ఆయిల్ మిల్లర్లు బిడ్లు వేసి కొనుగోలు చేస్తారు. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని 30 కేంద్రాల్లో వచ్చిన విత్తనాలను అమ్మకానికి పెట్టారు. ధర అధికంగా ఉండటంతో మిల్లర్లు కొనుగోలు కు ముందుకు రాలేదు.డిసెంబరు 2 వరకు పత్తి విత్తనాలు క్వింటాల్ ధర రూ. 2950 గా ఉంచారు.

అక్కడ తక్కువ ధర..

వాస్తవానికి పత్తి ఎక్కువ దిగుబడికి అవకాశం ఉన్న తెలంగాణలో విత్తనాల నాణ్యత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. తేమ శాతం కూడా తక్కువగా ఉంటుంది. ఆంధ్రాలో ఆ పరిస్థితి లేదు. ఇక్కడి వాతావరణ పరిస్థితుల బట్టి విత్తనాలు తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. ఆ ఉద్దేశ్యం తోనే ఆంధ్రాలోని సీసీఐ కేంద్రాల్లోని పత్తి విత్తనాల ధరలు, తెలంగాణ కంటే తక్కువగా ఉండాలని ఏపీ కాటన్ అసోసియేషన్ ఈ ఏడాది జూలైలో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో స్పష్టం చేసింది. ఆ సదస్సులో పాల్గొన్న సీసీఐ ఉన్నత అధికారులు అందుకు అంగీకరించినట్లు సమాచారం. కానీ సీజన్ ఆరంభం అయ్యాక మాత్రం అందుకు విరుద్ధంగా ధరలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆంధ్రాలో విత్తనాల ధరలు, తెలంగాణలో కంటే క్వింటాల్‌కు రూ. 100 వరకు తక్కువగా ఉండటంతో ఆయిల్ మిల్లర్లు అక్కడి నిల్వలు ఖాళీ చేశారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 30 సెంటర్లలో విత్తనాల నిల్వలు ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయాయి.




సీసీఐ కేంద్రాల్లో పేరుకుపోయిన పత్తి విత్తనాల నిల్వలు

ఒక్కో సెంటరులో వేల క్వింటాళ్లు..

సీజన్ ఆరంభం అయ్యాక ఇక్కడి విత్తనాల ధర క్వింటాల్ కు రూ. 2950 గా నిర్ణయించారు. దాంతో ప్రతి రోజు జిన్నింగ్ వల్ల వచ్చిన విత్తనాలు నిల్వ లు నిలిచిపోయాయి. ఒక్కొక్క సెంటర్ లో 5100 క్వింటాల్ల వరకు కూడా విత్తనాల నిల్వ లు ఉన్నాయి.ఉమ్మడి జిల్లాలోని అన్ని సెంటర్లలో 73100 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మిల్లుల్లో ఖాళీ లేక జిన్నింగ్ కు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాటన్ అసోషియేషన్ నేతలు సీసీఐ సీఎండీ కి మంగళవారం లేఖ రాశారు.దానిపై స్పందించిన సీఎండీ విత్తనాల ధరలను తగ్గించాలని అధికారులను ఆదేశించారు. పత్తి విత్తనాలు క్వింటాల్ ధర రూ . 2950 నుంచి తగ్గించి రూ. 2850 గా నిర్ణయించారు. ధర తగ్గగానే ఆయిల్ మిల్లర్లు విత్తనాలు కొనుగోలు ముందుకు వచ్చారు.సీసీఐ కి నగదు చెల్లింపు జరిగిన వెంటనే విత్తనాలు మిల్లుల నుండి బయటకు వెళ్లే అవకాశం ఉంది.

అమరావతికి నవకళ

(5వ పేజీ తరువాయి)



నాడు అమరావతి రాజధానికి శంకుస్థాపన జరిగిన ప్రదేశం (ఫైల్)

వాకింగ్ ట్రాకులు, సైక్లింగ్ ట్రాకుల నిర్మాణానికి రూ.3,859.66 కోట్లు కేటాయించారు. రాజధాని గ్రామాలను జోన్లుగా విడదీసి వాటిని అభివృద్ధి చేయనున్నారు. జోన్- 1ఏ కింద నెక్కల్లులో 1390.1 ఎకరాలు, జోన్- 1బీ కింద నెక్కల్లు, శాఖమూరులో 760.27 కోట్లు, జోన్- 2ఏ కింద అనంతవరం, నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరులో 1,223.76 ఎకరాలు, జోన్- 2 బీ కింద అవే గ్రామాల్లోని మరో 862.8 ఎకరాలు, జోన్- 5బీ కింద అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి గ్రామాల్లోని 1,788.42 ఎకరాలు, జోన్- 5డీ కింద అబ్బరాజుపాలెం, తుళ్లూరు, రాయపూడి గ్రామాల్లోని 1,488.81 ఎకరాలు, జోన్-6 కింద కొండమరాజుపాలెం, రాయపూడి గ్రామాల్లోని 981.72 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రధాన రహదారుల పనులకు రూ.2,498 కోట్లు, పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటేషన్ కాల్వ అభివృద్ధి, రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.1,585 కోట్లు కేటాయించారు. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన రాజధాని పనులను ప్రారంభించడంతో పాటు రైతుల ప్లాట్ల అభివృద్ధికి దాదాపు 4వేల కోట్లు కేటాయించడంపై రాజధానివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము కలలుగన్న రాజధాని అభివృద్ధి చెందడంతోపాటు, తమకు కేటాయించిన ప్లాట్లు తమకు దక్కబోతున్నాయని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు



చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాజధాని అమరావతికి మళ్లీ ప్రాణం వచ్చింది. చంద్రబాబు చొరవ, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో అమరావతికి మహర్దశ వచ్చింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాజధాని పునర్నిర్మాణం చేపట్టిన చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- బత్తుల కోటేశ్వరరావు, ఉద్దండరాయునిపాలెం

భారీగా నిధుల కేటాయింపు



కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని పనులు మొదలు పెట్టారు. రైతుల ఆశలు, ఆకాంక్షలను గుర్తించి వారి ప్లాట్ల అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు కేటాయించారు. రైతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు చూపుతున్న ఔదార్యం మరిచిపోలేనిది. చంద్రబాబును రాజధాని రైతులు ఎప్పటికీ మరిచిపోరు. ఆయనకు రైతులంతా రుణపడి ఉంటారు. **- లంకా సుధాకర్, వెంకటపాలెం.**

ఉత్కంఠగా ఎడ్ల బండలాగుడు పోటీలు

- జూనియర్స్ విభాగంలో హైదరాబాద్ ఎడ్లజత ప్రథమం
- నేడు సీనియర్స్ విభాగంలో పోటీలు



ప్రథమస్థానంలో నిలిచిన హైదరాబాద్ ఎడ్లజత

కారంపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానికంగా మంగళవారం జూనియర్స్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4503 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే రోహన్‌బాబుకే చెందిన మరో ఎడ్లజత 4430.05 అడుగులతో రెండో స్థానం, ప్రకాశం జిల్లా బురుజుపల్లెకు చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లజత 4400 అడుగులతో మూడో స్థానం, కర్ణాటక రాష్ట్రం పాల్యందొడ్డికి చెందిన ఖాజాహుస్సేన్ ఎడ్లజత 4200 అడుగులతో నాలుగోస్థానం, బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లజత 4000 అడుగులతో ఐదోస్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యలం సాంబశివరావు ఎడ్లజత 3901 అడుగులతో ఆరోస్థానంలో నిలిచాయి. బుధవారం సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు వ్యాఖ్యాతలుగా సూరపునేని రాధాకృష్ణ, గూడ శ్రీనివాసరావులు వ్యవహరించారు.

నేడు యడవల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యడవల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తిరుమల ఫీడర్ మరమ్మతుల కారణంగా గ్రానైట్ పరిశ్రమలకు, ఇతర పరిశ్రమలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్ కుమార్ మంగళవారం తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

6నుంచి రెవెన్యూ సదస్సులు

యడ్లపాడు, డిసెంబరు 3: భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రీ సర్వే సమస్యలతోపాటు వివిధ రకాల రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారం కోసం సదస్సులలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా ఈ నెల 6న కొండవీడు, 7న చెంఘీజ్‌ఖాన్‌పేట, 9న లింగారావుపాలెం, 10న సొలస, 11న తిమ్మాపురం, 12న ఉన్నవ, 13న మర్రిపాలెం, 16న వంకాయలపాడు, 17న కారుచోల, 18న సందెపూడి, 19న తుర్లపాడు, 20న జాలాది, 21వ తేదీన యడ్లపాడులో సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

7న పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్ల సమావేశం

చిలకలూరిపేట డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 వ తేదీన చిలకలూరిపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని చిలకలూరిపేట ఎంఈవో లక్ష్మి మంగళవారం చెప్పారు. మండల పరిధిలోని 87పాఠశాలల వారు అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. స్థానిక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మాట్లాడుతూ ప్రతి స్కూలు వారు విద్యార్థుల తల్లిదండ్రులకు వ్యక్తిగతంగా ఆహ్వానాలు పంపాలని, పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల ప్రగతి, రోజువారీ హాజరు, పరీక్షలలో పొందిన మార్కులు తల్లిదండ్రులకు తెలియచేయాలన్నారు. మునిసిపల్ హైస్కూల్ హెచ్ఎం జీవీరమణరావు, పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది చేకూరి వెంకయ్య చౌదరి మృతి

నరసరావుపేట లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది చేకూరి వెంకయ్య చౌదరి అనారోగ్యంతో మంగళవారం హైదరాబాదులో మృతి చెందినట్లు న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఆయన సంస్మరణ సమావేశం బుధవారం కోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఏఎన్‌యూ వీసీని కలిసిన జూనియర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ గంగాధర్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం గుంటూరు జిల్లా జూనియర్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లి బ్రహ్మయ్య కలిశారు. ఈ సందర్భంగా గంగాధర్‌ను, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ఆలపాటి శివప్రసాద్, డైరెక్టర్ వంకాలయపాటి వెంకటేశ్వరరావును కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్ షిప్ నమూనా పరీక్ష

నరసరావుపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని హర్షు జూనియర్ కళాశాలలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ నమూనా పరీక్షను మంగళవారం నిర్వహించారు. పల్నాడు జిల్లా విద్యాశాఖ, పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 400 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్ష పేపర్‌ను గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ హుస్సేన్, నరసరావుపేట ఎంఈవోలు ఎస్.ఏసుబాబు, ఎస్ నాగేశ్వరరావు, రిటైర్డు హెచ్ఎం ఎంఎస్ఆర్‌కే ప్రసాద్, పల్నాడు బాలోత్సవ కమిటీ సభ్యులు కట్టా కోటేశ్వరరావు, కోయ రామారావు, వెంకయ్య చౌదరి ఆవిష్కరించారు. ఈ నెల 8వ తేదీన ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. విజేతలకు అసిస్టెంట్ కంట్రోలర్ హుస్సేన్ బహుమతులు అందజేశారు.

గుండెపోటుతో కర్నాటక డ్రైవర్ మృతి

నాదెండ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని ధనలక్ష్మి స్పిన్నింగ్ మిల్లులో గుండెపోటుతో ఒక డ్రైవర్ మృతిచెందిన సంఘటన మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధనలక్ష్మి స్పిన్నింగ్ మిల్లులో దారాన్ని లోడు చేయించుకునేందుకు సోమవారం రాత్రి 11గంటల సమయంలో విజయవాడ నుంచి లారీ వచ్చింది. మంగళవారం ఉదయం 7గంటల సమయంలో క్లీనర్ ఇబ్రహీంతో కలసి ఇస్మాయిల్(58) అల్పాహారం తీసుకున్నాడు. గుండెలో నొప్పిగా ఉందని, వైద్యుని వద్దకు వెళ్లేందుకు క్లీనర్‌తో కలిసి ఆటో ఎక్కుతుండగా గుండెపోటుతో కుప్పకూలాడు. మృతుడు కర్నాటక రాష్ట్రంలోని బసవకళ్యాణ్ పట్టణవాసిగా గుర్తించారు.

ఆంజనేయస్వామికి అభిషేకాలు

నూజెండ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం మంగళవార సందర్భంగా మండలంలోని రవ్వవరం శ్రీ వీరాంజనేయ, నూజెండ్ల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలను అర్చకులు కోసూరి రామ్మోహనాచార్యులు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో దీక్షా స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌యూబీలోకి వర్షం నీరు

ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు


పంట పొలాల్లో నుంచి ఆర్‌యూబీలోకి ప్రవహిస్తున్న వర్షపు నీరు

వినుకొండ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విఠంరాజుపల్లి సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా సమీపంలోని పంట పొలాల్లోని నీరు ఆర్‌యూబీలోకి ప్రవహించడంతో ఆ ప్రాంతంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో విఠంరాజుపల్లి గ్రామం నుంచి పిచికలపాలెం వెళ్ళేందుకు రైల్వే గేటుద్వారా ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేవారు. రైల్వే అధికారులు రైల్వే గేటును తొలగించి ఎస్సీ కాలనీ సమీపంలో ఆర్‌యూబీని నిర్మించారు. బ్రిడ్జి ఏర్పాటుచేసినప్పటి నుంచి వర్షపునీరు బయటకు ప్రవహించే పరిస్థితి లేకపోవడంతో పంట పొలాలకు వెళ్ళే రైతులతోపాటు పిచికలపాలెం గ్రామానికి చెందిన ప్రజల వాహనాలు వినుకొండకు రావాలంటే తడిచి రావాల్సి వస్తోంది. అల్పపీడనం తాకిడికి మంగళవారం కురిసిన వర్షంతో పొలాల్లోని నీరు అంతా ఆర్‌యూబీలోకి కాలువలా పెద్ద ఎత్తున ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైల్వే అధికారులు ఆర్‌యూబీ నుంచి ప్రజలకు రాకపోకలకు వీలు కల్పించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు


క్రీడాకారిణులను అభినందిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

శావల్యాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకొని వాటిని అధిగమించేందుకు కృషి చేయాలని, అన్ని రంగాల్లో రాణించినపుడే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగగలరని రాష్ట్ర అసెంబ్లీ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఇటీవల జాతీయ, రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచిన శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థినులను వినుకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం అభినందించారు. నవంబరు 29, 30వ తేదీలలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో జరిగిన అండర్-17 బాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రథమస్థానంలో నిలిపిన విద్యార్థినులను, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభచూపిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్తులో మరింతగా రాణించాలని తెలిపారు. అనంతరం జీవీ మాట్లాడుతూ విద్యలో, క్రీడల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, తాము శివశక్తి ఫౌండేషన్ తరఫున వారికి ప్రత్యేక బహుమతులు, స్కాలర్‌షిప్‌లు అందజేసి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. అనంతరం బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలో మంచి శిక్షణనిచ్చి బాలికలను ప్రోత్సహిస్తున్న పీడీ రాధాకృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. నోబుల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు, ఎంఈవోలు సాంబశివరావు, జప్రుల్లా, పార్వతి, హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు భువనేశ్వరి, సహనాజ్ బేగం, హలీమా, నిర్మల, రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

వినుకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అవసరానికి డబ్బులు లేకపోయినప్పటికీ ఏ ఒక్క ప్రాణం పోకూడదనేది సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని నరగాయపాలెం గ్రామానికి చెందిన వెన్న కృష్ణమ్మ కుటుంబానికి రూ.65వేలు సీఎంఆర్ఎఫ్ సహాయనిధి చెక్కును జీవీ ఆంజనేయులు చేతులమీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అనారోగ్యానికి గురైన ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న నిరుపేదలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో యర్రం అంజిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

● డీఎస్పీ కే నాగేశ్వరరావు


సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ కే నాగేశ్వరరావు తదితరులు

నరసరావపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, వీటిని సరఫరా చేసేవారు యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారని డీఎస్పీ కే నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో మాదక ద్రవ్యాల వినియోగం, వాటి దుష్ఫలితాలుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ కే నాగేశ్వరరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా చెయిన్‌లా సాగుతోందని, రద్దీగా ఉండే ప్రాంతాలలో ఉండే కిళ్ళీ దుకాణాలు, కాఫీ షాపుల ద్వారా కూడా వీటి సరఫరా సాగుతుందన్నారు. టూటౌన్ సీఐ కే హైమారావు మాట్లాడుతూ సాధారణంగా సిగరెట్లు, ఆల్కహాల్ ద్వారా మాదక ద్రవ్యాలను తీసుకోవడం మొదలవుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు కేంద్ర నాడీ వ్యవస్థపై పనిచేసి శరీరాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, ఏవీఎన్ గుప్తా, నర్సింగ్ ప్రిన్సిపాల్ కే రేణుక, బీ నీల్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సైబర్ క్రైమ్ మత్తు పదార్థాలు, డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఎస్‌కే ఆర్బీఆర్ కళాశాలలో రెండో పట్టణ సీఐ హైమారావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులే లక్ష్యంగా అసాంఘిక శక్తులు పనిచేస్తున్నాయన్నారు. వారి సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100కు లేదా 112కు లేదా పల్నాడు జిల్లా ఎస్పీకి సమాచారం ఇస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

● నాదెండ్ల: విద్యార్థులు మత్తు పదార్థాలను తీసుకుంటే భవిష్యత్ అంధకార మవుతుందని ఎస్ఐ జీ పుల్లారావు అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్, డ్రైవింగ్, గుడ్, బ్యాడ్‌టచ్‌లపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయులు బీ శ్రీనివాసరావు, కే రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: మాదకద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం అవుతుందని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. యడ్లపాడు మండలం బోయపాలెం పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● కనమర్లపూడి (శావల్యాపురం) డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు అన్నారు. మండలంలోని కనమర్లపూడిలోని సంసిద్ పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలు, మత్తుపదార్థాల నియంత్రణపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు, మారకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం ఎస్ఐని పాఠశాల హెచ్ఎం ఒంటేరు నాగసురేష్, మేనేజర్ బాబు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు

గుంటూరు సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనాతో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం భేటీఅయ్యారు. చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయన నరసరావుపేట అభివృద్ధి పనులపై చర్చించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, నిధుల కేటాయింపు, మండల పరిషత్‌లకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ నరసరావుపేట అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా ఫ్రాన్సిస్ శౌరివారి మహోత్సవాలు


వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

బొల్లాపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో పునీత ఫ్రాన్సిస్ శౌరివారి ఉత్సవాలు గత మూడు రోజుల నుంచి ఘనంగా జరుగుతున్నాయి. ఫాదర్ జాకబ్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫాదర్లతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి. అన్నదానం చేశారు. వివిధ భక్తిగీతాలను మహిళలు ఆలపించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. మంగళవారం రెడ్డిపాలెంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన వాలీబాల్, మహోత్సవాల ముగింపు కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు హాజరయ్యారు. వాలీబాల్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను ఆంజనేయులు పంపిణీ చేశారు. బేతపూడికి ప్రథమ బహుమతి దక్కగా, బాపట్ల, పమిడిపాడు, జింకాలపాలెం జట్లకు వరుస బహుమతులు వచ్చాయి. కార్యక్రమంలో ఫాదర్ జాకబ్‌రెడ్డి, ఫాదర్ చందు, ప్రకాష్ మాస్టారు, రాజేశ్వరరావు, బాలస్వామి, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పేరుకుపోయిన చెత్త తొలగింపు


కాల్వలో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

వినుకొండ, డి సెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెరుమాళ్ళపల్లి మేజర్ కాల్వ ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తను మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ మంగళవారం పొక్లెయిన్ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ సమీప ప్రాంతంలోని ప్రజలు కాల్వలో చెత్త చెదారం వేయవద్దన్నారు. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లక్షల రూపాయలు వెచ్చించి కాల్వకు ఇరువైపులా నాటిన మొక్కలను కాపాడుకోవాలని కోరారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం


దివ్యాంగులకు కేక్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెంటల్లీ డిజార్డర్, డిజేబుల్డ్ పిల్లలకు ఉపాధ్యాయులు, ఆయాలు అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పాతూరులో ఉన్న ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లల భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు గతంలో దివ్యాంగుల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంతో మందికి ట్రైమోటర్ సైకిల్స్ అందజేశారన్నారు. భవిత కేంద్రం నిర్వాహకులు కే పద్మ, జీ మేరికుమారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, కర్నాటి కృష్ణమూర్తి, ఎంఈవో వీ ఏసుబాబు, హెచ్ఎం జీ మస్తానరావు, సీఆర్ఎంటీ జీ లాజర్, డీఎస్‌వీవ మహేష్, వో శ్రీనివాసరెడ్డి, వాసిరెడ్డి రవీంద్ర, మడకా శివప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశంతో స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రకాష్ నగర్‌లోని అంధుల ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు సీనియర్ సివిల్ న్యాయఅధికారి మధుస్వామి వివిధ చట్టాలను వివరించారు.

● శావల్యాపురం: శావల్యాపురం, కారుమంచి గ్రామాల్లోని దివ్యాంగుల పాఠశాలల్లో వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

● బొల్లాపల్లి: మండల కేంద్రమైన బొల్లాపల్లి భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

● యడ్లపాడు: భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో మండల విద్యాశాఖాధికారి నాగరత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

● ఈపూరు: భవితా కేంద్రంలో జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఎస్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

● నూజెండ్ల: దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యా వనరుల (భవిత) కేంద్రంలో మంగళవారం విద్యార్థులకు బహుమతులను, స్వీట్లను డాక్టర్ పుష్పేంద్ర కుమార్, హెచ్ఎం వీ శ్రీనివాసరావులు అందజేశారు.

● వినుకొండ: పట్టణంలోని భవిత కేంద్రంలో జరిగిన వికలాంగుల దినోత్సవంలో ముఖ్యఅతిథులుగా ఎంఈవోలు జప్రుల్లా, పార్వతిలు పాల్గొని బహుమతులు అందజేశారు.

మౌలిక సదుపాయాల కల్పన అవసరం

● మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ లక్ష్మీకుమారి

ఫటా ఫట్



చిలకలూరిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో నెలకొల్పిన వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సిబ్బంది అందరం కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్ళడానికి శాయశక్తుల కృషి చేస్తున్నామని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ లక్ష్మీకుమారి మంగళవారం చెప్పారు.

ప్రశ్న: ఆసుపత్రి సిబ్బంది వివరాలు ఏమిటి?

జ: ఆసుపత్రిలో మొత్తం 130 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో పర్మినెంట్ సిబ్బంది 96మంది వరకు ఉన్నారు. వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు 17 మంది ఉన్నారు.

ప్రశ్న: ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందా?

జ: వివిధ విభాగాలలో 19మంది సిబ్బంది అవసరం. ప్రధానంగా డాక్టర్లలో ఆప్తమాలజిస్టు, రేడియాలజిస్టు అవసరం ఉంది. మూడు ప్రమోషన్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

ప్రశ్న: మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి?

జ: ఆసుపత్రి వెనుక ఓగేరు వాగు ఉంది. ప్రధానంగా ప్రహరీ గోడ, రిటైనింగ్ వాల్, అంతర్గత రోడ్లు అవసరం. ఇందుకు రూ.9.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభం కాలేదు. సమస్యను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకువెళ్ళాం. ఆయన తక్షణం పనులు ప్రారంభించేలా అధికారులను ఆదేశించారు. ట్రామాకేర్ సౌకర్యం లేదు. అంబులెన్స్ కూడా లేదు.

ప్రశ్న: ఆసుపత్రికి సంబంధించిన ఇతర వివరాలు ఏమిటి?

జ: నెలకు సిజేరియన్లు, ట్యూబెక్టమీలు, సాధారణ డెలివరీలు100 వరకు ఉంటున్నాయి. జనరల్ సర్జరీలు సుమారు 50వరకు చేస్తున్నాం. ఎమర్జెన్సీ కేసులు నెలకు 60వరకు వస్తున్నాయి. ఆరోగ్యశ్రీ కేసులు 80వరకు వస్తున్నాయి. ప్రతి బుధవారం ఆర్థోకు సంబంధించి సదరం క్యాంప్ నిర్వహిస్తున్నాం. మందుల కొరత లేదు. స్కానింగ్, ఎక్స్ రే మిషన్లు కూడా ఉన్నాయి.

ప్రశ్న: ఆసుపత్రిలో ఉన్న వంద పడకలు సద్వినియోగం అవుతున్నాయా?

జ: పడకల ఆక్యుపెన్సీ శాతం తక్కువగా ఉంది. ఈ విషయంపై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించాం. వంద శాతం ఆక్యుపెన్సీ జరిగేలా సిబ్బంది సమిష్టిగా కృషిచేయాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. ఆ దిశగా సిబ్బందితో కలిసి పనిచేస్తున్నాం.

అమరావతికి రూ.11వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి అభివృద్ధికి రూ.11వేల కోట్లు కేటాయించడం శుభపరిణామమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమరావతిని నాశనం చేసిందన్నారు. అమరావతి కోసం 33వేల ఎకరాల భూమిని ఇచ్చిన రైతులను అవహేళనకు గురిచేసి ఎందరో ప్రాణాలను బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధ్వంసానికి గురైన అమరావతికోసం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాజధాని నిర్మాణాన్ని పునఃప్రారంభించి చివరి దశలో ఉన్న భవనాలను పూర్తిచేసి పరిపాలన సౌలభ్యం కోసం అధికారులకు కేటాయించనున్నారన్నారు. త్వరలోనే అమరావతి పనులు వేగవంతం కానున్నాయని, రాష్ట్ర ప్రజలు కలల రాజధాని అమరావతి అజరామంగా నిలుస్తుందన్నారు.

చిలకలూరి పేటలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు


సిబ్బందితో దుకాణాల వద్దకు వెళ్లి ఆక్రమణలను పరిశీలిస్తున్న మునిసిపల్ టీపీవో సుజాత

చిలకలూరిపేట డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఆక్రమణల తొలగింపునకు సంబంధించి చిలకలూరిపేట మునిసిపాలిటీ జోరు పెంచింది. పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు వద్ద నుంచి కళామందిర్ సెంటర్ వరకు, నరసరావుపేట సెంటర్ నుంచి రిజిస్ట్రార్ ఆఫీస్ వరకు, నరసరావుపేట సెంటర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు ప్రధానంగా ఆక్రమణల తొలగింపుపై దృష్టి పెట్టారు. మునిసిపల్ టీపీవో సుజాత తన సిబ్బందితో కలిసి మంగళవారం రిజిస్ట్రార్ ఆఫీసు రోడ్ లోని దుకాణాల వద్దకు స్వయంగా వచ్చి ఆక్రమణ తొలగించాలని కోరారు. ప్రతి దుకాణం వారిని కలిసి ఆక్రమణల తొలగింపునకు స్వచ్ఛందంగా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దుకాణాలు ఎంతవరకు ఉండవచ్చో మార్కింగ్ చేస్తామని, ఐరన్ పోల్స్ ఏర్పాటుచేస్తామని, అవి దాటి ఎవరు ముందుకు రాకూడదని ఆమె స్పష్టం చేశారు. కాగా పట్టణంలో పలు ప్రధాన రోడ్లలో ప్రభుత్వ స్థలాలను దశాబ్దాలుగా ఆక్రమించి కొందరు శాశ్వత దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ దుకాణాల ముందు ఉన్న ఖాళీ స్థలాలను అద్దెలకిచ్చి నెల నెలా వేల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్య జటిలమై పట్టణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

31వ తేదీలోగా ఫసల్ బీమా ప్రీమియం చెల్లించాలి

నాదెండ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేపడుతున్న వరి రైతులు డిసెంబరు 31వ తేదీలోగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించాలని ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కో-ఆర్డినేటర్ లింగయ్య తెలిపారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, కనపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఎకరా వరికి 1.5శాతం ప్రీమియం రూ.630ను చెల్లించాలని సూచించారు. శాస్త్రవేత్త ఎన్.నగేష్, ఏడీఏ పీ మస్తానమ్మలు మాట్లాడుతూ మొక్కజొన్న, మిర్చి, శనగ పంటల్లో అవలంబించాల్సిన ఎరువులు, పురుగు మందుల యాజామాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కామినేని లలిత నాగేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణచంద్రరావు, ఏఈవో జీవన్ నాయక్, సహాయకులు నాగరత్న కుమార్, రామాంజమ్మ తదితరులు పాల్గొన్నారు.